ప్రజాశక్తి
మంగళవారం 27 జూన్ 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

క్రూయిజ్ టర్మినల్‌కు

కేంద్రం ఎగనామం ?

◆ రూ.77 కోట్ల అంచనాలతో తయారై రూ.100 కోట్లకు పెరిగిన నిర్మాణ వ్యయం

◆ రూ.19 కోట్లతో చేతులెత్తేసిన కేంద్ర పర్యాటక శాఖ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ పోర్టు నుంచి అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేందుకుగానూ పోర్టు, కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా అమలు చేయాల్సిన 'క్రూయిజ్ టర్మినల్'కు కేంద్రం నిధులివ్వకుండా ఎండగడుతోంది. 2020 సంవత్సరానికి ముందు నుంచీ 'క్రూయిజ్ టర్మినల్' అంటూ కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ఊరిస్తూ ఉంది. తొలుత రూ.77 కోట్ల అంచనాతో ఈ టర్మినల్‌కు పోర్టు సాంకేతిక విభాగ అధికారులు అంచనాలు రూపొందించారు. తాజాగా నిర్మాణ జాప్యం వల్ల రూ.100 కోట్లకు చేరినట్లు పోర్టు ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. టర్మినల్‌కు సంబంధించిన పర్యావరణ ప్రభావ అంచనా (ఇఐఎ) నివేదికను కూడా కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ స్వీకరించింది. ఈ క్రమంలో ఆ నిధుల్లో 50 శాతం కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ, మిగిలిన 50 శాతం కేంద్ర పర్యాటక శాఖ ఇవ్వాల్సి ఉంది. ఇంతవరకూ రూ.19 కోట్లు మాత్రమే కేంద్రం నుంచి వచ్చాయి. పోర్టు హార్బర్‌లో క్రూయిజ్ టర్మినల్ కోసం పరిపాలన భవనానికి సైతం 2021లో శంకుస్థాపన జరిగింది. ఈ టర్మినల్ భవన నిర్మాణ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. పోర్టు అధికారులు కేంద్ర పర్యాటక శాఖకు నిధుల కోసం లేఖలు రాస్తున్నా సరైన రీతిలో స్పందన రావడం లేదు.



పోర్టు అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ జివిఎల్.నరసింహారావు

సముద్ర మార్గంలో పర్యాటకుల రాకపోకలే లక్ష్యం

క్రూయిజ్ టర్మినల్ ద్వారా సముద్ర మార్గంలో విదేశీ పర్యాటకులు, యాత్రికులను ఆకట్టుకునేందుకు పోర్టు యాజమాన్యం తన ఆదాయ సముపార్జనకు ప్రణాళికలు రూపొందించినా కేంద్ర సహకారం ఉండడం లేదు. చెన్నయ్‌కు మిగతా 2లో..



ఏర్పాట్లుపై సమీక్షిస్తున్న డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి

యుపిఎస్‌సి పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జూలై 2న జిల్లాలో జరగబోయే యుపిఎస్‌సి పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.శ్రీనివాస మూర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం పరీక్ష నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులుతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుపిఎస్‌సి నిర్వహించనున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రోవిడెంట్ ఫండ్ కమిషనర్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 11,520 మంది అభ్యర్థులు హాజరవుతారని, దీనికి 24 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష ప్రారంభమయ్యే గంట ముందు నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని, 10 నిమిషాలకు ముందు నిలిపివేస్తారని అన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యార్థులు చేరుకొనేలా సరిపోయే ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను, విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని ఎపిఇపిడిసిఎల్ అధికారులను, మంచి నీరు సరఫరా చేయాలని జివిఎంసి అధికారులకు ఆదేశించారు.

సమస్యలపై ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నా

▶ వార్త 2లో..

సూర్రెడ్డి కుటుంబానికి రూ.16 లక్షల పరిహారం

▶ వార్త 2లో..

జ్ఞానానంద ఆశ్రమంపై విచారణ జరపాలి

▶ వార్త 2లో..

బలవంతపు

ల్యాండ్ పూలింగ్ తగదు

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖ జిల్లా పద్మనాభం, ఆనందపురం, భీమునిపట్నం మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన బలవంతపు ల్యాండ్ పూలింగ్‌ను వెంటనే నిలిపివేయాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు 770 ఎకరాల ల్యాండ్ పూలింగ్ కోసం విఎంఆర్‌డిఎను పురికొల్పినట్టు తెలిసి ఆయా మండలాల ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ల్యాండ్ పూలింగ్ వల్ల రైతులు భూమిని, పంటను, ఉపాధిని కోల్పోతారన్నారు. తరతరాలుగా సంక్రమించిన ఆస్తిని వారసులకు అందించే అవకాశం లేకుండా పోతారన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన వ్యవసాయ కార్మికులకు ఉపాధి క్షీణిస్తుందని తెలిపారు. పశుపోషణ కష్టతరమవుతుందని పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్‌పై ఇప్పటికే రైతులు సంబంధిత అధికారులకు, ప్రభుత్వానికి తమ అభ్యంతరాలను, వ్యతిరేకతను తెలియజేశారన్నారు.

జగనన్న కాలనీల నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయ భూములు చూడాలన్నారు. ప్రభుత్వ బంజరు భూములు, కబ్జాదారులు స్వాహా చేసిన భూములను పరిశీలించాలన్నారు. అంతేగానీ ప్రజల జీవనాధారాన్ని బలవంతంగా గుంజుకునేందుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. బలవంతపు ల్యాండ్ పూలింగ్‌ను ఆపకుంటే ప్రజా ప్రతిఘటనను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

పాఠ్య పుస్తకాలివ్వండి



అనకాపల్లిలో విద్యార్థులు చేపట్టిన భారీ మానవహారం

◆ విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

◆ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నాలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని, నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల వ్యాపారం చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లి జిల్లా కేంద్రాల్లో సోమవారం ఆందోళనలు చేపట్టారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు బైఠాయించారు. ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ జయశ్రీకి వినతిపత్రం అందించారు. అనంతరం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌కు చేరుకొని భారీ మానవహారం చేపట్టారు. ముందుగా కార్మిక, కర్షక భవనం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.పావని మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రారంభించి 15 రోజులు కావస్తున్నా ఇప్పటికీ పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కళాశాలలో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, చదువుతున్న ప్రతి విద్యార్థికీ అమ్మఒడి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి మిగతా 2లో..



విశాఖ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మొదటి పేజీ తరువాయి..

కేంద్రం ఎగనామం ?

చెందిన ఐఐటిలో ఈ బెర్తు, టర్మినల్ నిర్మాణాలకు డిజైన్ కూడా చేయించడం పూర్తయింది. టర్మినల్ పనులు పూర్తయ్యేందుకుగానూ నిధుల కొరత వెంటాడుతోంది. 2022 ఫిబ్రవరి నాటికి పూర్తిచేయాలని తొలుత కార్యాచరణ తయారు చేసినా నేటికీ టర్మినల్ పనులు 50 శాతం కూడా పూర్తికాలేదు. మొత్తంగా 4500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ టర్మినల్ భవన పనులను చేపట్టాల్సి ఉంది. నగరంలోని పర్యాటకులను విదేశీ ప్రదేశాలకు తీసుకెళ్లి అక్కడ నుంచి ఇక్కడకు మరలా తీసుకొచ్చే ఏర్పాట్లు ఈ టర్మినల్ ద్వారా జరిగే అవకాశాలున్నాయి. పోర్టు ప్రాంతంలో (టర్మినల్ వద్ద) 7 బస్సులు, 70 వరకూ కార్లు, ద్విచక్ర వాహనాలు నిలుపుకునేలాగ పార్కింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో మొత్తంగా క్రూయిజ్ టర్మినల్ పనులు 12,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జరగాల్సి ఉంది. 300 మీటర్ల పొడవైన భారీ క్రూయిజ్ నౌకలు కూడా విశాఖ పోర్టుకు ఇది తయారైతే వస్తాయని పోర్టు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

పూర్తయితే.. దేశంలో నాలుగోది..

దేశంలో క్రూయిజ్ నౌకలకు ఇలా ప్రత్యేకంగా బెర్తు, టర్మినల్ సదుపాయం కలిగిన రాష్ట్రాలు చెన్నయ్, గోవా, కొచ్చిన్ మాత్రమే. విశాఖలో టర్మినల్ తయారైతే నాలుగోది కానుంది. టర్మినల్ ద్వారా 2 వేల మంది ప్రయాణికులకు సేవలు అందించవచ్చు. అయితే 2022లో ఒకసారి ట్రయల్ రన్ కింద క్రూయిజ్ టర్మినల్‌ను విశాఖ నుంచి చెన్నయ్‌కి నడపగా మార్గమధ్యలో సాంకేతిక సమస్యల వల్ల ట్రయల్ రన్ కూడా ఆగిపోయింది.

జులై నాటికి పూర్తిచేస్తాం : ఎంపీ జివిఎల్ నరసింహారావు

తాజాగా బిజెపికి చెందిన రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు సోమవారం విశాఖ పోర్టులో నిర్మాణంలోని క్రూయిజ్ టర్మినల్ భవన పనుల సందర్శనకు వెళ్లారు. ఈ ఏడాది జులై నాటికి ఈ నిర్మాణ పనులను పూర్తిచేస్తామంటూ పోర్టు అధికారులకు వెల్లడించారు. నిధుల సంగతి మాత్రం ప్రస్తావించకపోవడం ఇక్కడి విశేషం.

పాఠ్య పుస్తకాలివ్వండి

ఎస్.రమణ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మామిడి రమణ, డివిజన్ కార్యదర్శి గొర్లి తరుణ్, నాయకులు దివాకర్, యలమంచిలి డివిజన్ కార్యదర్శి బాబ్జీ, చోడవరం డివిజన్ కార్యదర్శి శ్రీనివాసరావు, 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖ కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. స్పందనలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలల్లో సౌకర్యాలు మృగ్యంగా మారాయన్నారు. నాసిరకమైన బ్యాగులతో విద్యా కానుక కిట్లు అరకొరగా అందించి ప్రభుత్వం ఆర్భాటం చేస్తోందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా యూనిఫాం, షూలు, పుస్తకాల విక్రయాలు జరుపుతూ పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నాయన్నారు. ప్రతి యాజమాన్యం ఒక్కో విద్యార్థి వద్దా రూ.10 వేలు నుంచి రూ.25 వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం పడుతోందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు శివ, ఉపాధ్యక్షులు జి.పల్లవి, ఎయు కార్యదర్శి పి.సూర్య, ఎం.శశి తులసీరాం, అజయ్, సాయితేజ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

సమస్యలపై ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, పెంచిన జీతాలు తగ్గించద్దని, 2022 నవంబర్ నుంచి ఎరియర్స్ చెల్లించాలని ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి పిలుపుమేరకు సోమవారం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో డిఎంహెచ్ఒ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి జెఎసి నాయకులు మాట్లాడుతూ స్టేట్ గవర్నమెంట్, సెంట్రల్ గవర్నమెంట్ కాంట్రాక్టు ఉద్యోగులు అన్న తేడా లేకుండా రెగ్యులర్ చేయాలని కోరారు. గత పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సెకండ్ ఎఎన్ఎంలకు వేతనాలు పెంచినట్లే పెంచి, తగ్గించడం అన్యాయమన్నారు. ధర్నా అనంతరం ఎఒకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు వీరబ్రహ్మం, గోపి, నాగరాజు, పవిత్ర, నాగలక్ష్మి, భవాని, దినేష్, రామాంజనేయులు, నాయుడు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మణి పాల్గొన్నారు.

జ్ఞానానంద ఆశ్రమంపై విచారణ జరపాలి

లైంగిక ఆరోపణలపై మహిళా సంఘాల ఐక్య వేదిక డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జ్ఞానానంద ఆశ్రమంపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై తక్షణం జ్యుడీషియల్ విచారణ జరిపించాలని మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఈ మేరకు వేదిక ఆధ్వర్యాన నిరసన తెలిపారు. స్పందనలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షురాలు బి పద్మ, కార్యదర్శి వై.సత్యవతి, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎంఎ.బేగం, చైతన్య మహిళ సంఘం అధ్యక్షురాలు పిఎస్.పద్మావతి ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కొంతమంది అనాథ, పేద బాలికలతో వెంకోజీపాలెంలో పూర్ణానంద సరస్వతి జ్ఞానానంద ఆశ్రమం నిర్వహిస్తున్నారన్నారు. పిల్లల జీవితాన్ని బాగు చేసే ఆశ్రమంగా ప్రచారం చేసుకుని ముందుకు వెళ్తున్నారన్నారు. అయితే పిల్లలపై దాడులు చేస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారని గతంలో కూడా అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. తాజాగా బాలికపై స్వామీజీ అత్యాచారం కేసు కూడా



ధర్నా చేస్తున్న మహిళా సంఘాల నాయకులు

నమోదైందన్నారు. ఈ నేపథ్యంలో జ్ఞానానంద ఆశ్రమ అరాచకాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆశ్రమం భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. మహిళా ఉద్యమకారులపై చేయి చేసుకున్న ఎస్ఐ దివ్య జ్యోతిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

సిఐటియు పోరాటంతో..

సూర్రెడ్డి కుటుంబానికి రూ.16 లక్షల పరిహారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 23న బిర్లా జంక్షన్ బృందావన్ పార్కు సమీపంలో జివిఎంసి ఇంజినీరింగ్ ఎలక్ట్రికల్ సెక్షన్‌లో పనిచేస్తున్న పిట్ల సూర్రెడ్డి విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన నేపథ్యంలో అతనికి పరిహారం ఇవ్వాలంటూ జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సాగుతున్న పోరాటం ఫలించింది. సోమవారం జివిఎంసి ఎలక్ట్రికల్ సెక్షన్ ఎస్ఇ సమక్షంలో 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, నాయకులు శీర రమణ, జె.నాయుడు, ఇ.ఆదినారాయణ, మృతుని కుటుంబ సభ్యులు, కాంట్రాక్టర్ మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో పిట్ల సూర్రెడ్డి కుటుంబానికి రూ.16 లక్షల నష్ట పరిహారం చెల్లించడానికి, తల్లికి కాంట్రాక్టర్ వద్ద ఉద్యోగం ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. అలాగే జివిఎంసి ఎడిసి, ఎస్ఇ కార్పొరేటర్ గంగారావులు జివిఎంసి కమిషనర్‌తో మాట్లాడి మృతిని కుటుంబానికి జివిఎంసి నిర్మిస్తున్న టిడ్కో ఇల్లు మంజూరు చేయడానికి కృషి చేయాలన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సేఫ్టీ పరికరాలు ఇవ్వకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. కార్మికులందరికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కోవిడ్ మహమ్మారి విజృంభన సమయంలో ఆర్టీసీ రద్దు చేసిన సిటీ బస్సులు అన్నింటినీ తిరిగి పునరుద్ధరించాలని వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్ కోరారు. సోమవారం ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు కొన్ని సిటీ బస్సు రూట్లను రద్దు చేసినప్పటికీ అందులో కొన్నింటిని తిరిగి పునరుద్ధరించ లేదన్నారు. ముఖ్యంగా 535, 540, 541, 900, 20 ఎ రూట్లలో బస్సులను రద్దు చేశారన్నారు. పోస్టాఫీసు నుంచి హెచ్‌బి కాలనీ వరకు నివాస ప్రాంతాల్లో తిరిగే 20 ఎ బస్సును రద్దు చేయడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిని తిరిగి పునరుద్ధరణ చెయ్యాలని డిమాండ్ చేశారు.

విజెఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వహించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : వైజాగ్ జర్నలిస్టుల ఫోరం సర్వసభ్య సమావేశం నిర్వహించాలని సంస్థ సభ్యుల బృందం సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం ఎన్నికలకు ముందే సర్వసభ్య సమావేశాన్ని ఐదుగురు అధికారులతో ఏర్పడిన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. ఈ ప్రక్రియ నిబంధనల ప్రకారం ఎన్నికల ముందు తప్పనిసరని కలెక్టర్‌కు తెలిపారు. విజెఎఫ్ అనధికార కార్యవర్గం అక్రమాలు, అవినీతిపై దర్యాప్తును వేగవంతం చేసి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సర్వసభ్య సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫిర్యాదులపై దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన విజెఎఫ్ సభ్యుల బృందంలో పి.సత్యనారాయణ సుంకర సూర్యం, జి.ఆనంద్, ఇఎన్ఎస్.బాలు, దొండా రమేష్, కె.చంద్రమోహన్, యర్రా నాగేశ్వరరావు, శ్రీహరి భాస్కర్ ఉన్నారు.

జూలై 1న జనరల్ బాడీ సమావేశం

సభ్యుల ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్ కమిటీకి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు కమిటీ ప్రెస్‌క్లబ్‌ను సోమవారం సాయంత్రం సందర్శించి అధికారుల కమిటీ ఆధ్వర్యంలో జూలై 1న సర్వసభ్య సమావేశం జరగబోతుందని ప్రకటించింది. మంగళవారం మధ్యాహ్నానికి ఫోన్ నెంబర్లతో కూడిన సభ్యులు జాబితాను విజెఎఫ్ నోటీసు బోర్డులో పెడతామని అధికారులు చెప్పారు. జమా ఖర్చుల వివరాలను పరిశీలన కోసం ఇవ్వాలని జిల్లా ఆడిటర్ అధికారి కోరారు. మంగళ, బుధ వారాలలో రికార్డుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిఐజి బాలకృష్ణ, డిడి మణిరామ్ పాల్గొన్నారు.

కెజిబివి సిబ్బందిని కొనసాగించాలని ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఏళ్ల తరబడి కెజిబివిల్లో పనిచేసిన వారిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. స్పందనలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో మండలానికి ఒక కెజిబివిలను ఇంటర్మీడియట్‌కు అప్‌గ్రేడ్ చేశారన్నారు. కెజిబివిలో ఐదు సంవత్సరాల నుంచి పని చేస్తున్న తెలుగు, ఇంగ్లీషు ఉపాధ్యాయులను తొలగించడం సరికాదని, వారిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. తక్షణమే కౌన్సిలింగ్‌ను ఆపివేసి కెజిబివి కాంట్రాక్టు ఫ్యాకల్టీనీ కొనసాగించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, జిల్లా నాయకులు తులసి, ఉమ, జ్యోతి, కెజిబివి గెస్ట్ ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి -తగరపువలస : చదువులో వెనుకబడిన విద్యార్థులకు అవసరమనుకుంటే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సూచించారు. జివిఎంసి ఒకటో వార్డు పరిధి బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. జెవికె కిట్లు ఏ మేరకు అందినవీ విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. నాడు, నేడు పథకంలో భాగంగా ఇప్పటికే చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యార్థుల నోట్ బుక్స్‌ను పరిశీలించారు. విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతికుమారి, జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఇఇ డివి.నరసింహారావు, ఎఇ మహాలక్ష్మి, అకడమిక్ మానిటరింగ్ అధికారి లక్ష్మి, ఎంఇఒలు 1, 2 లు కెఎ.బాలామణి, అట్టాడ జయప్రద, పాఠశాల హెచ్‌ఎం రెడ్డిపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.

కెజిబివి సందర్శన

భీమిలి, గొల్లలపాలెంలో ఉన్న కెజిబివిని కూడా శ్రీనివాసరావు సందర్శించారు. వంట గదిని పరిశీలించారు. మెనూ అమలు తీరును విద్యార్థినులనడిగి తెలుసుకున్నారు. తాగు నీటి సమస్య ఉందని విద్యార్థినులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశమై చర్చించారు. డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి గౌరీ శంకర్, జిసిడిఒ ఖలీశా బేగం, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ గంగా కుమారి పాల్గొన్నారు.



జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నేరాలు ఘోరాలు

ఏలేరు కాలువలో మహిళ మృతదేహం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట వద్ద ఏలేరు కాలువలో ఓ మహిళ మృత దేహాన్ని సోమవారం గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం... సోమవారం ఉదయం 8 గంటల సమయంలో కసింకోట గ్రామం సత్యమ్మకు తల్లి కాలనీకి వెళ్తున్నవారు ఏలేరు కాలు వంతెనకు ఎడం పక్కన నీటిలో తేలుతూ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించి విఆర్ఒకు సమాచారం అందించారు. ఆమె వయస్సు సుమారు 40-45 సంవత్సరాలు ఉంటుంది. నీలిరంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించి ఉంది. ఆమె ఎవరనేది తెలియరాలేదు. దీనిపై విఆర్వో ధరిమిరెడ్డి ఉదయ్ కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎఎస్ఐ టి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-అనకాపల్లి : హత్య కేసులో ముద్దాయికి 14 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష (జీవిత ఖైదు), 20 వేల రూపాయల జరిమానా, కట్టని పక్షంలో మరో 3 నెలల సాధారణ జైలు శిక్ష స్పెషల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు విధించినట్లు ఎస్పీ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... 2016 డిసెంబర్ 16న రాత్రి సమయంలో దేవరాపల్లి మండలం, కాశీపురం గ్రామంలో ఎన్.రమాదేవి భర్త నిరుజోగి రామునాయుడు అలియాస్ రాము (28)ను అదే గ్రామానికి చెందిన మాతల దాలి నాయుడు తన వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నారని కోపంతో తన ఇంటి ముందే కర్రతో విచక్షణ రహితంగా తలపై, మొహంపై కట్టాడు. దీంతో రామునాయుడు మృతి చెందాడు. దీనిపై సాగిన దర్యాప్తు మేరకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బివి.రమణమూర్తి వాదనను సమర్థిస్తూ విశాఖపట్నం స్పెషల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు, 11వ ఎడిజె కోర్టు ఈ తీర్పును సోమవారం వెల్లడించారు. జిల్లా ఎస్పీ కెవి. మురళీకృష్ణ దర్యాప్తుధికారి వై.మురళీ రావు, వాదనలు వినిపించిన స్పెషల్ పీపీబివి. రమణమూర్తిని అభినందించారు.

జంతు పునరావాస కేంద్రంలో పులి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల ఎదురుగా గల జంతు పునరావస కేంద్రంలో కుమారి (23) అనే రాయల్ బెంగాల్ ఆడ పులి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. వృద్ధాప్యం, మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ కారణంగా కుమారి మృతి చెందినట్టు వైద్యులు పోస్టుమార్టం రిపోర్టులో నిర్ధారించారని జూ క్యూరేటర్ డాక్టర్ నందినీ సలారియా తెలిపారు. 2000వ సంవత్సరంలో కుమారి జన్మించిందని, 2007లో ఫేమస్ సర్కస్ నుంచి విశాఖ జంతు సంరక్షణ కేంద్రానికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. సాధారణంగా అడవిలో పులి సగటు జీవిత కాలం 12 నుంచి 15 ఏళ్ళు ఉంటుందని, జంతు పునరావస కేంద్రంలో సిబ్బంది సంరక్షణలో ఉండటంతో కుమారి 23 ఏళ్ల జీవించ గలిగిందని తెలిపారు.

ఘనంగా అశోక్ గజపతి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సింహాచలం : సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం అర్చకులు, ఉద్యోగ సంఘం నాయకులు, అధికారులు అశోక్‌గజపతిరాజు ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆశీర్వచనాలను అందించారు. విశాఖ పార్లమెంటు నియోజకవర్గం టిడిపి ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్ కూడా అశోక్‌గజపతిరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు,రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-ఆనందపురం : గిడిజాల విద్యుత్ లైన్లలో మరమ్మత్తుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. జోన్ 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గిడిజాల, బాకూరుపాలెం, గుమ్మడివానిపాలెం, రెగానిగూడెం, మిందివాని పాలెం, చిన్నయ్యపాలెం తదితర గ్రామాలలో గృహ, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మధురవాడ : మధురవాడ ఫీడర్‌పై మరమ్మత్తుల కారణంగా బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్ 3 డిఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. వుడా కాలనీ ఫీడర్, ఎన్జీవో కాలనీ, శుద్ధగడ్ ఏరియా, వాంబే కాలనీ, పోర్టు కాలనీ, శ్రీనివాసనగర్‌కు బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని డిఇతోపాటు ఎఇ శ్రీరామమూర్తి కోరారు.

పిహెచ్‌సిలో సమస్యలపై వినతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పలు సమస్యలపై డాక్టర్ గంగునాయుడుకు జనసేన ఆధ్వర్యాన సోమవారం వినతిపత్రం అందజేశారు. భీమిలి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల పిలుపు మేరకు ఆనందపురం మండలంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జనసేన నాయకులు పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నా ప్రజలకు పూర్తిగా అందడం లేదని డాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం జనసేన నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ, మండలంలో సుమారు 26 పంచాయతీల్లో లక్షకుపైగా జనాభా ఉన్నా ఆరుపడకల పిహెచ్‌సి ఉండటం బాధాకరమన్నారు. 30 పడకలకు పెంచాలని కోరారు. ఆసుపత్రిలో అన్ని రకాల మందులు ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శాఖరి శ్రీనుబాబు, ఆర్.కృష్ణయ్య, చందర్రావు, మజ్జి శ్రీను, దుక్క వెంకటరావు, తాడివాడ శివకృష్ణ, మీసాల నాగేశ్వరరావు, నాని నర్సింగరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఎఇఒ భ్రమరాంబ స్వాగతం పలికారు. ఆయన ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

బిఆర్‌టిఎస్ బాధితుల వినతి

సింహాద్రి అప్పన్న దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును పాత గోసాల నుంచి అడవివరం వరకు ఉన్న బిఆర్‌టిఎస్ బాధితులు కలిశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

స్పందనకు 9 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో పలు సమస్యలపై జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు స్థానికులు 9 అర్జీలు అందజేశారు. జోనల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన స్పందనలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రెండు అర్జీలు, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 7 అర్జీలు అందజేశారు. సంబంధిత అర్జీలను ఆయా శాఖలు, విభాగాల అధికారులకు జెడ్సీ పంపించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని సోమవారం విశాఖ వ్యాప్తంగా పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

గోపాలపట్నం : చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.మురళీమోహనరావు తెలిపారు. కళాశాల ప్రాంగణంలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు వాడడం వల్ల విద్యార్థి దశ పాడవుతుందని చెప్పారు. గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు మాట్లాడుతూ, సమయం వృథా చేయకుండా క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ సిహెచ్‌విఎస్.ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్ పి.శాంతలక్ష్మి ఆధ్వర్యాన విద్యార్థులకు మాదకద్రవ్యాలు వాడటం వలన కలిగే దుష్ఫలితాల గురించి అవగాహన కల్పించారు.

భీమునిపట్నం : మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ సిబిఎం పాఠశాల మీదుగా గంట స్తంభం వరకు సాగింది. ఈ సందర్భంగా మానవ హారం నిర్వహించారు. ర్యాలీని కళాశాల ప్రిన్సిపల్ పి.ఉమారాణి కళాశాల వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పి.వేణుగోపాల్, కె.ప్రసాదరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు. తగరపువలస శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బి.నరసింగరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.చిట్టిరెడ్డి, ప్రిన్సిపల్ జె.సతీష్‌కుమార్ అధ్యాపకులు పాల్గొన్నారు. భీమిలి మండలం, రఘు ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఇబి సూపరింటెండెంట్ బి శ్రీనాథుడు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

ఆనందపురం: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మిందివానిపాలెం విశ్వనాథ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్స్ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల నివారణకు అందరూ ఐక్యంగా పోరాడుదాం అని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సీతమ్మధార : మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ యువతకు పిలుపునిచ్చారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక, అక్రమ రవాణా దినోత్సవ పోస్టర్‌ను సిఎమ్‌డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, ఎవివి.సూర్యప్రతాప్, సిజిఎం అచ్చి రవికుమార్, క్యాంపెయిన్ కన్వీనర్ సురేష్ బేత, డాక్టర్ సంతోష్, లిఖిత్ బేత తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: నర్సీపట్నంలో ప్రపంచ మాదకద్రవ్య దుర్వినియోగం, వినియోగ వ్యతిరేక దినం సందర్భంగా నర్సీపట్నం ఏఎస్పి అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రేవేటు స్కూల్, కళాశాలల విద్యార్థులతో స్థానిక శ్రీ కన్య కూడలి నుండి అబీద్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పి అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాల వినియోగ, రవాణాకు దూరంగా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో సిఐ నమ్మి గణేష్, గోవిందరావు, ఎస్ఈబి ఎస్సై చంద్రశేఖర్ రాజు, కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

గొలుగొండ: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఎస్ఈబి సిఐ రాజారావు ఆధ్వర్యంలో జోగుంపేట జంక్షన్‌లో సోమవారం హైస్కూల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబి ఎస్సై గిరి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు నాలుగు రోడ్ల కూడలిలో డ్రగ్స్‌పై సబ్ ఇన్స్పెక్టర్ల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : మాదక ద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సందర్భంగా అనకాపల్లి రింగ్ రోడ్ జంక్షన్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ రవి, ఎస్‌పి కెవి.మురళీకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.హేమంత్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ, జిల్లా అదనపు ఎస్పీలు పి.సత్యనారాయణరావు, బి.విజయభాస్కర్, అనకాపల్లి డిఎస్పి వి.సుబ్బరాజు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, పైడపు నాయుడు, వెంకట్రావు, దాడి మోహనరావు, టి.శ్రీను, ఎస్సైలు సత్యనారాయణ, రమేష్, పిటివి.కుమార్, ఎస్సై కె.శ్రావణి, దాడి వీరు నాయుడు డిగ్రీ కాలేజ్, హిమ శేఖర్ డిగ్రీ, జూనియర్ కాలేజ్, సంయుక్త డిగ్రీ కాలేజ్, శ్రీ చైతన్య, నారాయణ, సర్వేపల్లి రాధాకృష్ణ జూనియర్ కాలేజ్ విద్యార్థులు సుమారు 800 మంది పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్‌పి

గిరి ప్రదక్షిణ రోడ్డు పునర్నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : గిరి ప్రదక్షిణ నేపథ్యంలో ఉత్తర నియోజక వర్గం పరిధిలోని సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ఆర్ అండ్ బి రోడ్డు జంక్షన్ సమీపంలో ఒక హోటల్ వరకు రూ.9 కోట్ల వ్యయంతో చేపట్టిన రహదారి పునర్నిర్మాణ పనులను జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మతో కలిసి వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం పరిశీలించారు. రహదారికి ఇరువైపులా ఉన్న వ్యర్థాలను తొలగించాలని సిబ్బందిని జివిఎంసి కమిషనర్ ఆదేశించారు. నాణ్యతలో రాజీ పడకుండా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కెకె.రాజు మాట్లాడుతూ, పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు నిత్యం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనుక్, అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, రెయ్యి వెంకటరమణ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, 48వ వార్డు ఇన్‌ఛార్జి నీలి రవి, యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

కారు డెకార్స్ పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : గురుద్వార్ సమీపంలో ఇటీవల అగ్నిప్రమాదం సంభవించి దగ్ధమైన వైజాగ్ కార్ డెకార్స్ షాపును ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం సందర్శించారు. షాపు యజమాని వరబాబుతో మాట్లాడి జరిగిన నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, కిరణ్‌రాజు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బద్రికి పరామర్శ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇటీవల ప్రమాదానికి గురైన 55వ వార్డు వైసిపి నాయకులు బద్రిని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం పరామర్శించారు. బద్రి ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 55వ వార్డు కార్పొరేటర్ కెవిఎన్.శశికళ, వై.సిద్ధార్థ రాజు, ఏర్రంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

53వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 53వ వార్డు పరిధి శివనగర్, హుస్సేన్‌నగర్ ప్రాంతంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, 53వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ బర్కత్ అలితో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు మాటలు మాత్రమే చెప్పేవారని, జగన్మోహన్‌రెడ్డి మాత్రం చెప్పింది చేసి చూపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, రాష్ట్ర నాయకులు హెచ్‌బి ఫరూకి, కిరణ్ రాజు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కెవి.బాబా, 48వ వార్డు ఇంచార్జ్ నీలి రవి, ఎయిర్ పోర్టు అడ్వయిజర్ కమిటీ మెంబర్ అంబటి శైలేష్, వెంకటేష్, వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలకు వినతి

ప్రజాశక్తి- తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధిచిల్లపేట, జీరుపేట, రెల్లిపేట తదితర గ్రామాలకు సంబంధించిన శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వైసిపి వార్డు అధ్యక్షులు సిహెచ్.భాస్కరరెడ్డి, సీనియర్ నాయకులు బి.హరికిరణ్‌రెడ్డి సోమవారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు వినతి పత్రం అందజేశారు. ఏడు గ్రామాలకు చెందిన శ్మశాన వాటికలో రేకుల షెడ్డు, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, విద్యుత్ లైట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధిలోని ప్రధాన కూడళ్లలో హై మాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని టిడిపి మూడో వార్డు అధ్యక్షులు గంట నూకరాజు సోమవారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు స్పందనలో వినతి పత్రం అందజేశారు. నేరెళ్లవలస కాలనీ కొండవాలు ప్రాంతంలో వీధిలైట్లు వేయాలని, పలు ప్రాంతాల్లో 50 విద్యుత్ స్తంభాలు వెయ్యాలని, ఎన్‌టిఆర్ మినీ స్టేడియంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎగువపేట, బోయి వీధి, గొల్లవీధి, నేరెళ్లవలస కాలనీలో సిమెంట్ రోడ్లు, కాల్వలు వేయాలని కోరారు.

నివాసమున్న చోటే ఇళ్ల స్థలాలివ్వాలి : సిపిఎం



తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పెందుర్తి : నివాసమున్నచోటే పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగన్ మాట్లాడుతూ, భూ పోరాటం చేసి సర్వే నెంబర్ 123లో కొంతమంది నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. వారిలో కొంతమందికి పట్టాలు ఇచ్చారని, ఇంకా కొంతమంది మిగిలి ఉన్నారని వివరించారు. వారందరికీ జగన్మోహన్‌రెడ్డి ఎక్కడో ఇళ్ల పట్టాలిస్తే అక్కడికి వెళ్లి వారు ఏమి చేయగలరని ప్రశ్నించారు. ఇక్కడ పనులు చేసుకుంటున్న వారికి ఎక్కడో పట్టాలివ్వడం సరికాదన్నారు. పేదలు ఉంటున్న ఈ స్థలాన్ని గత, ప్రస్తుత ఎమ్మెల్యేల అనుచరులు కబ్జాచేస్తున్నా అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు.

సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో వేల ఎకరాలను ప్రజా ప్రతినిధులు కబ్జా చేశారని, దీనిపై తహశీల్దార్ కార్యాలయంలో సిపిఎం ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలూ చేపట్టలేదని విమర్శించారు. పేదలు చిన్న గుడిసె వేసుకుంటే వెంటనే అధికారులు వచ్చి తొలగిస్తున్నారన్నారు. పేదలకు నివాసమున్న చోట ఇళ్లు ఇవ్వకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాని కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అప్పలనాయుడు, ఐద్వా నాయకులు రజని తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక జంక్షన్ నుంచి 60 అడుగుల రోడ్డుకు వచ్చే నూతన డివైడర్‌లో మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటుచేయాలని కోరుతూ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి అఖిల భారత మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగరపు శ్రీను వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ గాంధీ విగ్రహం ఏర్పాటుకు తన వంతు కృషిచేస్తానని హామీఇచ్చారు. ఆ వినతిపత్రాన్ని కలెక్టర్‌కు రిఫర్ చేశారు. ఆ వినతి పత్రాన్ని సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు అందజేశారు. గాజువాక జంక్షన్‌లో స్వతంత్ర సమర యోధుల విగ్రహం ఏర్పాటుకు అధికారులు ముందుకు రావాలని జాగరపు శ్రీను కోరారు. విగ్రహం ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇస్తే ఖర్చు అంతా తాము భరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాఘవరెడ్డి హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ సురేష్ రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం గాజువాక యూత్ అధ్యక్షులు శానాపల డిల్లీశ్వరరావు, ఎన్ఆర్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ ఎన్ఆర్, నెమ్మలూరి శివగణేశ్వర్మ, అఖిల భారత మానవ హక్కుల సంఘం ఆంధ్ర తెలంగాణ డైరెక్టర్ చెరపాక రామచంద్రరావు, గోపాల కృష్ణారెడ్డి, వృధ్వి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు పరిధి గురుద్వారా వెనుక రోడ్డులో బిఎస్ లే-అవుట్-2లో సిసి రోడ్డు, కల్వర్టులు, డ్రెయిన్ల నిర్మాణాలకు సంబంధించి వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు సమక్షంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, గడపగడపకు మన కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు ఈ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్, ఎఐ శ్రీరామ్మూర్తి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, లంకా భాస్కరరావు, బల్లా శ్రీను, కె.సత్యనారాయణ, కె.చిన్న, హరికృష్ణ, తులసి, కాలనీ పెద్దలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి సీతంపేట జివికె.ప్లాజా ఎదురుగా పిండి మిల్లు వీధిలో సిసి రోడ్డు, డ్రెయిన్లు నిర్మాణ పనులకు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ నేతృత్వంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు ఈ పనులకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐ శ్రీరాంమూర్తి, బోగవల్లి గోవింద్, హరికృష్ణ, సమ్మెట్ల వెంకటేష్, లక్ష్మణ్ కుమార్, కె.చిన్న, జయ, అశోక్, సన్నీ, ప్రసాద్, కాలనీ పెద్దలు, మహిళలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను పకడ్బందీగా నిర్వహించాలి : ముత్తంశెట్టి

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పనిచేయాలన్నారు. మండలంలోని 18 సచివాలయాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి అర్హులై ఉండి ఇంకా సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించాలని చెప్పారు. అలా గుర్తించిన వారికి జగనన్న సురక్ష కార్యక్రమంలో అందే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జగనన్న సురక్ష ప్రత్యేకాధికారి సంధ్య ప్రభ, ఎంపిడిఒ లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, జెడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు, వైసిపి మండల అధ్యక్షుడు బంక సత్యనారాయణ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోనీ అప్పలనాయుడు, వైస్ ఎంపిపి పాండ్రంగి శ్రీను, బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని బాందేవుపురం గ్రామ పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, 11 రకాల సమస్యల్లో ప్రతి ఇంటికి రెండు నుంచి మూడు వరకు ఉన్నాయని, వాటిని పరిశీలించి పరిష్కరించాలని కోరారు. అనంతరం కోరాడ గ్రామానికి చెందిన కోరాడ నరసింహనాయుడుకు సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందించారు.

ఎల్‌పిసిలు ఇవ్వడం లేదని, గ్రామంలోని ఎస్‌సి శ్మశానవాటికకు రహదారి కల్పించాలని, ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యేను గ్రామానికి చెందిన దళిత నాయకుడు చిరంజీవి కోరారు. ప్రభుత్వ అనుమతితో సొంత స్థలంలో ఇల్లు కట్టుకున్న వారికి ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని ఎమ్మెల్యేకు విలాస్‌ఖాన్‌పాలేనికి చెందిన వైసిపి నాయకుడు ఆర్ఎం.నాయుడు వివరించారు. దీనిపై గృహ నిర్మాణ శాఖ అధికారులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు, మండల వైసిపి అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు, ఎంపిటిసి బోని సావిత్రి, సర్పంచ్ నల్లి సత్యవతి, తహశీల్దార్ తోట శ్రీవల్లి, నాయకులు బంగారాపుడు, ఆదిబాబు, కె.శ్రీనివాసరావు, ఎం.శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై సిపిఐ ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : కేంద్రం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పేర్లతో విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై పెనుభారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ ఆధ్వర్యాన పెదగంట్యాడ సబ్‌స్టేషన్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, మునుపెన్నడూ లేని విధంగా ట్రూఅప్, ఫిక్సడు, ఎలక్ట్రికల్, కస్టమర్, విద్యుత్ టారిఫ్ అంటూ ఆరు రకాల ఛార్జీలు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. వందల్లో వచ్చే కరెంట్ బిల్లు నేడు వేలల్లో వస్తోందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తగ్గించాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపిఐ నాయకులు పల్లేటి పోలయ్య, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పి.దుర్గారావు, వై.నందన్న, సోమేష్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-పెందుర్తి : బిఎస్‌పి బలోపేతానికి కృషి చెయ్యాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పరం జ్యోతి కోరారు. 97వ వార్డు పరిధి శాంతినగర్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. వైసిపి, టిడిపిలతో జనం విసిగిపోయి ఉన్నారని తెలిపారు. బిఎస్‌పి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బోను కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరుబండి ప్రకాశరావు, రాష్ట్ర ఈసీ మెంబర్ ప్రభాకర్, గంగరాజు సత్యం, రమణ, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ ఆదేశాలు మేరకు ఎంవిపి .కాలనీ అప్పుఘర్ నుంచి వరహానరసింహస్వామి గిరి ప్రదక్షిణలో నడిచే భక్తులకు ఆటంకం లేకుండా జోన్ 3 పరిధిలోని ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించినట్లు పట్టణ ప్రణాళిక అధికారి నరేంద్ర తెలిపారు. ఫుట్‌పాత్‌లను ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి శాస్త్రి సభనన్, టిపిఒ తేజ, టిపిఎస్ అనిత, ప్లానింగ్ సెక్రటరీలు, చైన్‌మ్యాన్లు పాల్గొన్నారు.

పోలవరం పోరుకేకకు విరాళాల సేకరణ

- ప్రజల నుంచి విశేష స్పందన



అనకాపల్లిలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు



మునగపాకలో...



కంచరపాలెంలో...

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

పోలవరం నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి తలపెట్టిన పోలవరం పోరుకేక మహా పాదయాత్రకు సంఘీభావ నిధి వసూళ్లకు ఆ పార్టీ పిలుపునివ్వగా సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల విరాళాలు సేకరించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

అనకాపల్లి : పోలవరం పాదయాత్ర జయప్రదానికై సిపిఎం నాయకులు, కార్యకర్తలు సోమవారం స్థానిక అనకాపల్లి ఆర్టీసి కాంప్లెక్స్ నుండి నాలుగురోడ్ల జంక్షన్ వరకు సంఘీభావ నిధి సేకరణ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరికీ మేలు చేకూరుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, ఏలూరు జిల్లాల పరిధిలో 8 మండలాల్లో 222 పంచాయితీలు, 373 గ్రామాలు వర్షాకాలంలో నీట మునిగిపోతున్నాయని, ఇక్కడ నివసించే గిరిజనులు, గిరిజనేతరుల లక్షల కుటుంబాలకు సహాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, బి.ఉమామహేశ్వరరావు, నాయకులు డి.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, పి.చలపతి, డి.డి.వరలక్ష్మి, బి.నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : పోలవరం నిర్వాసితుల సంఘీభావ నిధి సేకరణ సోమవారం మండల కేంద్రంలో దుకాణాల నుండి చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు గండి నాయినబాబు మాట్లాడుతూ అదానీ, అంబానీలకు లక్షల కోట్లు ప్రజల సొమ్మును కట్టబెడుతున్న మోడీ ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకం కోసం సర్వం త్యాగం చేస్తున్న పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని, నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు పోలవరం నిర్వాసితుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎర్ర దేవుడు, గాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : పోలవరం నిర్వాసితుల మహా పాదయాత్రకు సంఘీభావంగా సిపిఎం నాయకులు వివి



విశాఖ జగదాంబలో...

శ్రీనివాసరావు, ఆళ్ల మహేశ్వరరావు, ఎస్ బ్రహ్మాజీల నేతృత్వంలో సోమవారం మండల కేంద్రంలో విరాళాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల సుమారు మూడు లక్షల కుటుంబాలు సర్వం కోల్పోయి వీధిన పడ్డాయని తెలిపారు. నిర్వాసిత అమాయక గిరిజనులకు పరిహారం ఇవ్వాలని సిపిఎం 400 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టిందని, వారిని ఆదుకోవడం రాష్ట్ర ప్రజలందరి బాధ్యత అని పేర్కొన్నారు.

నక్కపల్లి : పోలవరం పోరుకేక పేరుతో మహాపాదయాత్ర జయప్రదానికి సంఘీభావంగా మండలంలోని తిరుపతిపాలెం గిరిజన గ్రామంలో సోమవారం సిపిఎం బృందం నిధి వసూళ్ళు చేపట్టారు. గిరిజనలు ఎంతో ఉత్సాహంగా విరివిరిగా విరాళాలను అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు బి.నాగేశ్వరరావు, ఎం.నానాజీ, వి.సత్తిబాబు, కె.అప్పారావు, సింహాచలం పాల్గొన్నారు.

కలెక్టరేట్ : సిపిఎం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో జగదాంబ సెంటర్ నుంచి దసపల్లా హోటల్ వరకూ విరాళాలుసేకరించారు. ప్రజల నుంచి రూ.25 వేలు సంఘీభావ నిధి సమకూరింది. కార్యక్రమంలో పార్టీ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు కె.నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన ఊర్వశి నుంచి కంచరపాలెం వరకు పోలవరం సంఘీభావ నిధిని సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. పద్మ మాట్లాడుతూ, పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం కల్పించాలని, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.సోమేశ్వరరావు, పి.రామారావు, ఒ.అప్పారావు, ఎం.ఈశ్వరరావు, శారద, ధర్మరాజు, ఒ.విజయ, ఎస్.సుశీల, సిహెచ్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : కొత్త గాజువాకలో సిపిఎం ఆధ్వర్యాన పోలవరం పోరుకేక పాదయాత్రకు సంఘీభావ నిధిని సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, పోలవరం నిర్వాసితులకు న్యాయం చేసేందుకు ఈ పోరాటం సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు ఎల్.కామేశ్వరి, ఎ.లోకేశ్వరరావు, చెన్నారావు, ఎన్‌వి.రమణ, వై.లక్ష్మణరావు, పి.యశోదరాణి, ఆర్.స్వర్ణలత, ఆర్.నాగేశ్వరరావు, పి.నానాజీ, ఎం.ప్రసాదు, పి.అప్పారావు పాల్గొన్నారు.



కె.కోటపాడులో...



నక్కపల్లి మండలం తిరుపతిపాలెంలో...



కొత్త గాజువాకలో..

అదనపు విద్యుత్ ఛార్జీలపై సిపిఎం కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి- దేవరాపల్లి

వివిధ రకాల పేరుతో అదనంగా విద్యుత్ ఛార్జీలు వేయడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం మండల కేంద్రంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర మాట్లాడుతూ నష్టాలు వస్తున్నాయనే సాకుతో ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీల పేరుతో జనం నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్న విద్యుత్ పంపిణీ సంస్థలు తాజాగా మరోసారి గుట్టు చప్పుడు కాకుండా జనంపై మరో భారాన్ని మోపాయని తెలిపారు. దాదాపు 15 నెల కాలంలోనే రకరకాల పేర్లతో మూడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన ప్రభుత్వం తాజాగా నాలుగోసారి



కొవ్వొత్తులు వెగిలించి నిరసన తెలుపుతున్న చిన్నారులు, ప్రజలు, సిపిఎం నాయకులు

కొత్త భారం మోపిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తాజా ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నెలనెలా ట్రూఅప్ విధానాన్ని మే నెల నుంచే అమల్లోకి తీసుకురావడంతో జూన్ నెలలో ప్రతి వినియోగదారుడికీ ఇంట్లో కరెంటు వాడుకోకున్నా షాక్ కొట్టేలా బిల్లులు వచ్చాయని తెలిపారు. ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో యూనిట్‌కు 40 పైసలు చొప్పున కొత్త భారాన్ని వినియోగదారులపై మోపి వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. 8 నెలల కాలంలో రెండుసార్లు రూ.5,983 కోట్ల భారం మోపాయన్నారు. విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా ఈ నెల 30న వామపక్షాల ఆధ్వర్యాన తల పెట్టిన ఆందోళనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె సన్యాసి, సిహెచ్ దేముడు, సిహెచ్ లక్ష్మణ, సిహెచ్ ఈశ్వరరావు, కె పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి తదితరులు

జిల్లాలో 77 మందికి 'వైఎస్ఆర్ లా నేస్తం'

ప్రజాశక్తి-అనకాపల్లి

వైఎస్ఆర్ లా నేస్తం కింద మూడో విడత నుండి అనకాపల్లి జిల్లాలో 77 జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5వేలు చొప్పున రూ.3,85,000 విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి వెలగపూడి సిఎం క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో జగనన్న లా నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరం నుంచి ఈ కార్యక్రమంలో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బివి.సత్యవతి, డిఆర్‌డిఎ పిడీ లక్ష్మీపతి, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాకు సంబంధించి 2019 డిసెంబర్ నుండి 2023 మే వరకు 55 మందికి నెలకు రూ.5000 చొప్పున రూ.1.13 కోట్లు వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఈ 3వ విడతలో కొత్తగా 14 మంది జూనియర్ న్యాయవాదులు చేరడంతో ఇకపై ప్రతినెల అనకాపల్లి జిల్లా మొత్తంగా 77 మందికి లా నేస్తం అందిస్తున్నట్లు చెప్పారు.

కౌలు రైతుల సమస్యలపై నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యాన సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రైతు భరోసా చెల్లించాలని, పంట సాగుకు ముందుగా పంట రుణాలు ఇవ్వాలని, పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఎకరాకు పదివేల రూపాయలు రైతు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, రైతు నాయకులు రాజాన దొరబాబు, రావు జగ్గారావు, రెడ్డిపల్లి అప్పలరాజు, గొల్ల గురుబాబు, సన్యాసిరావు, మేక సత్యనారాయణ, కాసుబాబు, శంకర్రావు, వరహాలు, సూరిబాబు, దేవుడు బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-చోడవరం

గాజువాకలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 25న ఆదివారం జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో సబ్ జూనియర్, కాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో చోడవరంకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించినట్లు కోచ్ పల్లం మురళీకృష్ణ తెలిపారు. సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొనగా చోడవరం క్రీడాకారులు 30 పతకాలు సాధించారు. సబ్ జూనియర్, కాడెట్, జూనియర్, సీనియర్ డివిజన్, పూమ్ సేల్లో వల్లూరి ఇసిత శారదా, కొల్లిపార తన్విత్ ఉదయ్ , గండి కారుణ్య సంల్లో కె.రోహిత్, జషిక రోజిల , యమ్ హేమా శ్రీ, డియస్‌యస్ అంజని ప్రియ, సోనారి తనహ, బొబ్బిలి సత్య రామ చంద్ర, పియస్‌యస్ తరుణ్, ఆకుల ముఖేష్, డి కృష్ణవేణి, క్యొరుగిలో విశిసిత శారదా, జివి శశి వర్ధన్, వి జసిక రోజిలి, కొసిరెడ్డి లావణ్య, ఆకుల ముఖేష్, లంకపల్లి గిరీష్, జి గిరి శంకర్ బంగారు పతకాలు సాధించారు. యస్ జాహ్నవి, యస్ సారూన్ రజత పతకాలు, యస్ ప్రయాంజన్ సాయి, పి జాన జశ్వంత్, ఆర్ దీక్షిత, తరుణ్, తనహ, జి నాగ సాయిరామ్, హేమశ్రీ కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు వచ్చే నెల 2వ తేదీన తిరుపతిలో జూనియర్, విజయనగరంలో 15,16 తేదీల్లో కాడెట్, సెప్టెంబర్ నెలలో కాకినాడలో సీనియర్, నవంబర్ నెలలో నంద్యాలలో జరగబోయే సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



పతకాలు సాధించిన విద్యార్థులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మండలం అయితంపూడి గ్రామంలో తారురోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ తారు రోడ్డుకు ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ కనెక్టివిటీ ప్రాజెక్ట్ నిధులు రూ.74.60 లక్షలు మంజూరయ్యాయి. కొంతకాలంగా పనులు జరుగుతుండగా, సోమవారం తారు రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ పెద్దాడ నాయుడు, ఎంపిటిసి దేవర అప్పారావు, ఎంపిపి దాకవరపు నాగేశ్వర దేవి నాగరాజు, జడ్పిటిసి దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు కొలిమల్ల అచ్చం నాయుడు, వైస్ ఎంపిపి దొండా నారాయణమూర్తి, సీనియర్ నాయకులు కోవెల జనార్ధన్, ఏతం డి ఈ పాల్గొన్నారు. నియోజకవర్గ వైసిపి సోషల్ మీడియా కో కన్వీనర్ ముచ్చకర్ల వెంకట్రావు గ్రామ పెద్దలు సమక్షంలో ఎమ్మెల్యేను సాలువాతో సత్కరించారు.

తుమ్మపాలలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వాణి జగదీశ్వరి ఆధ్వర్యంలో సోమవారం తుమ్మపాల ఇందిరానగర్ కాలనీలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగ సమస్యలపై వైద్య సేవలు అందించారు. ఇంటింటికి వెళ్లి ఆరోగ్యంపై వారికున్న సమస్యలపై సూచనలు చేసి మందులు ఇచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని, ఎన్ ఈశ్వరరావు, ఆశా వర్కర్లు ఏఎన్ఎం జయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్పందనకు 259 అర్జీలు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) గ్రీవెన్స్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై 259 అర్జీలు అందాయి. వీటిని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత స్వీకరించారు. గ్రామ వార్డ్ సచివాలయం నోడల్ అధికారి మంజులావాణి, డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి, డ్వామా పీడీ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్పీ కార్యాలయంలో..

జిల్లా ఎస్పీ కార్యాలయ స్పందన కార్యక్రమానికి 39 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ మురళీకృష్ణ వాటిని స్వీకరించారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఎస్‌బి ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై చక్రధర్ పాల్గొన్నారు.

120 మంది కంటి రోగులకు పరీక్షలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం

మండలంలోని హరిపాలెంలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 120 మంది కంటి రోగులను వైద్యులు పరీక్షలు చేశారు. 12 మంది కంటి రోగులకు క్యాటరాక్ట్ ఆపరేషన్ చేయడానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవ భజన మండలి కన్వీనర్ కర్రి ఆది నాగేశ్వరరావు, ఎం సూర్యనారాయణ, బుద్ధ వెంకట సత్యనారాయణ, దాడి మత్స్యరాజు, తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తుమ్మపాల సుగర్స్ జోలికొస్తే తరిమికొడతాం

ప్రజాశక్తి-అనకాపల్లి

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ 13వేల మంది రైతులదని, దీని జోలికొస్తే తరిమికొడతామని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హెచ్చరించారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ సుగర్ ఫ్యాక్టరీ ఆస్తులను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టే కుట్ర చేస్తున్నారని ఆరోపిస్తూ టిడిపి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీలా గోవింద మాట్లాడుతూ తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ కోసం ప్రభుత్వం నియమించిన లిక్విడేషన్ ప్రక్రియను, లిక్విడేటర్‌ను రద్దు చేయాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు. అప్పటి రాజ్యసభ సభ్యులు వివి రమణ గ్రామ గ్రామాన తిరిగి రైతుల దగ్గర నుండి 1కోటి రూపాయలు వసూలు చేసి సహకార రంగంలో ఈ ఫ్యాక్టరీని నిలబెట్టారని గుర్తు చేశారు. రైతులకు, షేర్‌హోల్డర్స్‌కు చెప్పకుండా సుగర్ ఫ్యాక్టరీని అమ్మకానికి పెడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, కొణతాల శ్రీనివాసరావు, కర్రి బాబీ, తలారి కాశీ నాయుడు, జోగినాయుడు, పోలారపు త్రినాథ్, గంగా శ్రీను, బోసు బాబు, పిట్ల రాజు, ఆకుల శ్రీను, సింహాచలం, ఎంపిటిసి గణేష్, నాంబారి శ్రీను, చదరం కాశీ, ఆకుల నానాజీ, బుజ్జి, కరణం రమణ, కరణం పవన్ కుమార్, కరణం కోటి, తదితరులు పాల్గొన్నారు.

నేటి యువతకు వివి.రమణ ఆదర్శం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాజ్యసభ మాజీ సభ్యులు, కీర్తిశేషులు వివి రమణను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. స్థానిక రింగ్ రోడ్‌లోని పెంటకోట కన్వెన్షన్ సెంటర్లో ఆదివారం రాత్రి జరిగిన వివి రమణ శతజయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నీతి నిజాయితీతో, అంకితభావంతో రైతు సంక్షేమం కోసం రమణ పాటుపడ్డారని కొనియాడారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజా సంక్షేమం కోసం రాజీలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. అనంతరం వివి రమణ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి వేగి సూరి అప్పారావు మాట్లాడుతూ వివి రమణ రాజీలేని పోరాటం చేసి రైతాంగానికి సేవలు అందించారన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ మల్ల సాంబశివరావు మాట్లాడుతూ వివి రమణకు గుర్తుగా తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని తిరిగి పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం వెంకయ్య నాయుడును వీరభద్రరావు, దాడి రత్నాకర్, రమణమూర్తి ఘనంగా సత్కరించారు. ముందుగా వివి.రమణ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లీడర్ దినపత్రిక సంపాదకుడు వివి రమణమూర్తి ఆధ్వర్యంలో, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ, యుపిఎస్‌సి మాజీ సభ్యులు కెవిఎస్ చలం, రాజా సాగి రామచంద్ర రాజు, తమ్మన సుబ్బారావు, వేదుల దినకర్, వివి రమణ కుమారుడు రంగాజీ, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల నుండి మినహాయింపు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : నాడు-నేడు పథకం కింద చేపట్టే భవన నిర్మాణ పనుల నుండి తమకు మినహాయించాలని కోరుతూ మండలంలోని అంగన్వాడీ టీచర్లు సోమవారం స్పందనలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఏవో ప్రసాద్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇసుక, సిమెంట్, ఇటుక, ఇనుము తదితర మెటీరియల్ తీసుకోవడం అర్ధరాత్రి, అపరాత్రి లేకుండా పంపిణీ చేయడం, వీటికి సంబంధించిన ఏడు రకాల రికార్డులు రాయటం, నగదు చెక్కుల రూపంలో చెల్లింపులకు బ్యాంకుల చుట్టూ తిరగడం తదితర అనేక పనులు మహిళలైన అంగనవాడీలకు అప్పగించి పని భారాన్ని పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు అంగన్వాడీ కేంద్రంలో పిల్లల సంరక్షణ, గర్భిణులు, బాలింతలకు భోజనాలు వండి వడ్డించడం, యాప్స్ నిర్వహణ, వైఎస్ఆర్ కిట్లు పంపిణీ, పిపి-1, పిపి-2 కార్యక్రమాలు, విద్యా బోధన వంటి వాటితో ఇప్పటికే పని ఒత్తిడి ఉండగా, ఇప్పుడు భవన నిర్మాణ పనులు అప్పగించడం సరికాదని పేర్కొన్నారు. తక్షణమే భవన నిర్మాణ పనుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ సెక్టార్ నాయకులు జయలక్ష్మి, ఉమాదేవి, సరస్వతి, శివలక్ష్మి, రేవతి, ప్రమీల, నాగూర్‌బీ, సిఐటియు నాయకులు ఎస్ బ్రహ్మాజీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు పాల్గొన్నారు.

28న ఎంఆర్‌పిఎస్ కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి- సబ్బవరం : ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం ఈ నెల 28న చోడవరంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్ గోటివాడ సామ్రాట్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చోడవరం ఇందిరా కాలనీలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి ఎంఆర్‌పిఎస్ ఉత్తర ఆంధ్ర కోస్తా జిల్లాల కన్వీనర్ మూముడివరపు చిన సుబ్బారావు మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. దీనిని విశాఖ ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

యోగాతో ప్రశాంతత, ఆరోగ్యం

ప్రజాశక్తి- అనకాపల్లి : యోగాతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం, జ్ఞానం పెంపొందుతాయని శ్రీరామచంద్ర మిషన్ హర్ట్ ఫుల్ నెస్ సెంటర్ ఉచిత ధ్యాన యోగ సెంటర్ కోఆర్డినేటర్ జి మంగయ్య తెలిపారు. స్థానిక రింగ్ రోడ్‌లోని శ్రీరామచంద్ర మిషన్ హర్ట్ ఫుల్ నెస్ సెంటర్లో ఆదివారం యోగా పోటీలు నిర్వహించారు. వివిధ వయస్సులకు చెందిన వారి 7 బ్యాచ్‌లుగా పోటీలు నిర్వహించారు. 8 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలు వరకు పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు పాల్గొన్నారు. బ్యాచ్‌ల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సర్టిఫికెట్లు, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఆరోగ్యం మానసిక ప్రశాంతత దూరమవుతుందని, వీటిని సాధించేందుకు ప్రతి ఒక్కరూ యోగా, ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కోలపర్తి భవన నిర్మాణ స్థాపకులు కోలపర్తి జయబాబు, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ జి కృష్ణ, యోగ గురువు మాదేటి జనార్ధన్ పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు' బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం హైస్కూల్‌లో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మెరిట్ బహుమతులు అందజేశారు. టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కబర్చిన విద్యార్థులు వానపల్లి రోహిత్, రెడ్డి భావ్యశ్రీ, దాసరది భాగ్యలక్ష్మి, గుమ్మడి మోహన్, కడియాల జ్యోత్స్నకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం విజయలక్ష్మి సుమన్, వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, గుమ్మడి శ్రీనివాసరావు, గుమ్మడి గోవింద, పాల్గొన్నారు



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ గంగాధర్

ఇద్దరు డైరెక్టర్లు ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ పాల సొసైటీకి సోమవారం జరిగిన ఎన్నికలలో శిలపరశెట్టి వెంకటరావు, గొలగాన నాగేశ్వరరావు డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు ఉత్తమ సేవలు అందించడానికి నూతనంగా ఎన్నుకోబడ్డ డైరెక్టర్లు కృషి చేయాలని కోరారు. పాల సేకరణ కేంద్రం వద్ద ఈ కార్యక్రమంలో పాల సొసైటీ అధ్యక్షులు కుమార వెంకటరమణ, సొసైటీ కార్యదర్శి చిన్ని వెంకట నరసింహమూర్తి, పాల సొసైటీ మాజీ అధ్యక్షులు కుమార ఎర్రి నాయుడు, మాజీ డైరెక్టర్ శిల్పరశెట్టి వెంకటరమణ, వార్డు మెంబరు రాపేటి ప్రసాదు, శిల్పరశెట్టి ముస్లిం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులకు మూలపేట ప్రాథమిక పాఠశాల ఎంపిక

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : నాడు-నేడు పథకానికి మండలంలోని మూలపేట మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఎంపికైనట్లు మూలపేట సర్పంచ్ బీశెట్టి గంగ అప్పలనాయుడు తెలిపారు. సోమవారం పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్యాలయాల అభివృద్ధికి నాడు నేడును ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింగరావు, వార్డు మెంబర్లు మొల్లేటి గోవిందరావు, కాండ్రేగుల వరలక్ష్మి, శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఆడారి చిరంజీవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పథకాలు ఆగిపోతాయని భయపెట్టడం అవివేకం

ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని, మీ ప్రాంతాలకు వస్తే నిలదీయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చెప్పడం అవివేకమని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు విరుచుకుపడ్డారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేర్లు మార్చి తామే ప్రవేశపెట్టినట్లుగా వైసిపి ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. టిడిపి మినీ మేనిఫెస్టోను చూసి వైసిపికి వణుకు పుట్టిందని తెలిపారు. ఇప్పటికే వైసీపీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత రోజురోజుకీ పెరుగుతుందన్నారు. ఓటమి భయంతోనే మంత్రులు, ఎమ్మెల్యేలపై గట్టిగా మాట్లాడలేక బుజ్జగింపు ధోరణితో వేడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు కుప్పిలి జగన్, విల్లూరి రమణబాబు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం : మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి : తమది మాటలు ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, ఇచ్చిన హామీలు 90 శాతానికి పైగా నెరవేర్చామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చెప్పారు. అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ గ్రామంలో కాలువల నిర్మాణం చేపట్టాలని స్థానికులు మంత్రిని కోరగా, త్వరలో చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఒకరిద్దరిని మంత్రి అమర్నాథ్ కలుసుకుని వారి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, గ్రామ సర్పంచ్ మార్పూరు సన్యాసమ్మ, ఎంపిటిసి మంత్రి సత్తిబాబు, వైసిపి నాయకులు కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బోరు బావి ఏర్పాటు

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : మండల కేంద్రం శనివాడ వారి కల్లాల వద్ద సిఎల్సి చర్చ్ అధినేత బిషప్ మహంతి ఆధ్వర్యంలో సోమవారం తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. వైసిపి మండల అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చం నాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ పర్యవేక్షణలో దీనిని వేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జెడ్పిటిసి సభ్యులు దొండ రాంబాబు నిధులతో సోమవారం చిట్టియ్య పాలెంలో తాగునీటి బోర్‌ను ప్రారంభించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు పథకాలు



నక్కపల్లిలో సర్వే పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని వేంపాడు, కాగిత, ఉద్దండపురం గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్షలో భాగంగా వాలంటీర్లు ఇంటింటా సర్వే చేపట్టారు. తహసీల్దార్ అంబేద్కర్, ఎంపిడిఓ సీతారామరాజు సర్వేను పరిశీలించారు. పక్కాగా సర్వే చేపట్టాలని వాలంటీర్లకు ఆదేశించారు. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులై ఉండి తప్పిపోయిన వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూరుస్తామన్నారు. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు ఎటువంటి రుసుము లేకుండా అందజేస్తామన్నారు. సచివాలయాలను సందర్శించి సర్వేలో భాగంగా టోకెన్స్ జనరేషన్, సర్వీసెస్ జనరేషన్ పరిశీలించారు.వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని పుత్తడి గైరంపేట గ్రామ పంచాయతీ సచివాలయంలో జగనన్న సురక్షపై సోమవారం సచివాలయం వాలంటీలకు, కన్వీనర్లకు గృహ సారథులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నల్లబెల్లి శ్రీనివాసు, మండల వైసిపి ఎంఎల్‌ఓ నానిలు మాట్లాడుతూ, ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు ఏమైనా ఉన్నాయా?, సర్టిఫికెట్లు అవసరం అనుకుంటే వెంటనే అప్లై చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పత్తి రమణ పాల్గొన్నారు.

చీడికాడ:మండల కేంద్రంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, కోఆర్డినేటర్లతో మండల సచివాలయ కన్వీనర్ ఈర్లీ చైతన్య అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ,గ్రామ సచివాలయంలో ప్రజలందరికీ ఉచితంగా రైస్ కార్డ్, ధ్రువీకరణపత్రాలు ఎటువంటి చార్జీలు లేకుండా ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందన్నారు. వాలంటీర్లు దృష్టి పెట్టి ప్రజలందరికీ సమాచార అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు



మాట్లాడుతున్న నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్ :గడపగడపకి మన ప్రభుత్వ కార్యక్రమం నర్సీపట్నం మున్సిపాలిటీ శారదనగర్ లో సోమవారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, స్థానిక నాయకులతో కలిసి వార్డు పరిధిలో కోటి 15 లక్షలతో అభివృద్ధి చేసిన పనులను పర్యవేక్షించారు. గడపగడపకూ తిరుగుతూ ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలిటీ అధికారులు, మున్సిపల్ చైర్పన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ ఛైర్మన్లు తమరాన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ, వార్డు కౌన్సిలర్లు, పార్టీ అధ్యక్షులు ఏకాశివ, సచివాలయల కన్వీనర్ తమరాన శీను, యూత్ అధ్యక్షుడు దనిమిరెడ్డి ప్రసాద్, పలువురు కౌన్సిలరు పాల్గొన్నారు.

బావిలో పడి మహిళ మృతి

ప్రజాశక్తి - చీడికాడ:బావిలో పడి మహిళ మృతి చెందిన సంఘటన తునివలస గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ఘటన వివరాలు.. తుని వలస గ్రామానికి చెందిన గంట్ల ముత్యాలమ్మ (42) గత మూడు రోజులుగా కనిపించడం లేదని కుటుంబ సభ్యులు చీడికాడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుండి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతక సాగారు. సోమవారం ఆమె తుని వలస గ్రామంలో బావిలో శవమై తేలింది. ఇటీవల ఆమె భర్త కూడా మతి చెందారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్ఐ రామారావు తెలిపారు.

బాలిక వైద్యానికి సహాయం

ప్రజాశక్తి-రోలుగుంట:ం మండలంలోని కొంతలం గ్రామానికి చెందిన గిరిజన బాలిక చింతా యూన్సీకి కడుపులో ఆపరేషన్ నిమిత్తం నలుగురు లైవ్ బ్లడ్ డోనర్స్‌పై జనసేన నేతలు స్పందించారు. డోనర్స్ ఎవరూ అందుబాటులో లేకపోవడంతో గత ఆరు నెలలుగా ఆపరేషన్ చేయలేదు. ఈ విషయంపై స్పందించిన కొంతలం జనసేన నాయకులు కేశిరెడ్డి శివాజీ, సోమిరెడ్డి బాబ్జీ వెంటనే నలుగురు లైవ్ డోనర్స్‌ను సిద్ధం చేసి బాలికకు ఆపరేషన్ పూర్తి చేయించారు. ఈ ఆపరేషన్‌కి అన్ని విధాలుగా సహకరించిన జనసేన పార్టీ నాయకులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి-చీడికాడ:విద్యార్థులు చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రధానో పాధ్యాయుడు బి.వి.రమణ అన్నారు చీడికాడ మండలం చుక్కపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బివి రమణ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పలు పథకాలు అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన కోరారు. దాతలు గోపి కొండలరావు, విద్యాసాగర్‌లు ఉచితంగా ఇచ్చిన హిందీ, తెలుగు కాపీ రైట్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు



పుస్తకాలు ఇస్తున్న దాతలు

ఈ కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి లక్ష్మణ్, స్కూల్ కమిటీ చైర్మన్ పెచ్చేటి రాము, ఉపాధ్యాయులు శ్యామ్ కుమార్, కుమారి పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్‌లో జాబ్‌మేళా

50 మంది విద్యార్థుల అర్హత



ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి -పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పెసెన్ డిగ్రీ కళాశాలలో వసుధ ఫార్మా కెమికల్ లిమిటెడ్ కంపెనీ (హైదరాబాద్) ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు సోమవారం నిర్వహించారు. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలకు విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు చెందిన వివిధ కళాశాలల నుండి ఫైనల్ ఇయర్ బి.ఎస్సి., ఎం.ఎస్సి కెమిస్ట్రీ విద్యార్థులు సుమారు 150 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ డిప్యూటీ మేనేజర్, హెచ్.ఆర్ హర్షవర్మ మాట్లాడుతూ, సంస్థకు సంబంధించిన పద్ధతులను, నియమాలను తెలియజేశారు. సుమారు 50 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలో అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సి.హెచ్.వి కె.నరసింహారావు, సహాయ కార్యదర్శి సి.హెచ్. విజయ్ ప్రకాష్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ప్రొడక్షన్ శ్రీరామమూర్తి, గణేష్ పుత్ర కుమార్, అసిస్టెంట్ మేనేజర్ డి.వర్మ రాజు, వైస్ ప్రిన్సిపల్ పెనుగొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

100 అడుగుల విస్తరణ చేపడతాం

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: పట్టణంలోని ప్రధాన రహదారి 100 అడుగుల విస్తరణ జరిగి తీరుతుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ స్పష్టం చేశారు. వైసీపీ నాయకుడు పోతల ప్రసాద్ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రధాన రోడ్డు విస్తరణ 80 అడుగులకే పరిమితమవుతుందని, రెండు మూడు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడతాయని వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే గణేష్ స్పందించారు. విలేకరులతో మాట్లాడుతూ, నర్సీపట్నం ప్రధాన రోడ్డు విస్తరణ 100 అడుగులు చేసి తీరుతామని పునరుద్ఘాటించారు. బ్రోకర్ల మాటలు, పేటీఎం బ్యాచ్ మాటలు పట్టణ ప్రజలు నమ్మ వద్దన్నారు. ఎవరెవరో వస్తుంటారని, ఏవేవో మాటలు చెబుతుంటారని, అటువంటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వారి మాటలు పరిగణనలోకి తీసుకోరాదన్నారు. ఆటువంటి వారి గురించి మాట్లాడడం కూడా సమయం వృథా చేసుకోవడమే అన్నారు. తామంతా నర్సీపట్నం అభివృద్ధికి సమైక్యంగా పని చేస్తున్నామన్నారు. రోడ్డు విస్తరణ అంశం ఒకవేళ కోర్టు పరిధిలో ఉంటే కోర్టు ఇచ్చిన సూచనల మేరకు నడుచుకుంటామని స్పష్టం చేశారు. కోర్టు ఆంక్షలు లేకపోతే పనులు ముందుకు సాగు తాయన్నారు. మరో వారం రోజుల్లో పనులు మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. భవన యజమానులు నర్సీపట్నం అభివృద్ధికి సహకారం అందించాలని ఆయన కోరారు.

జీవాలకు నట్టల మందు పంపిణీ

ప్రజాశక్తి- చీడికాడ:మండలంలోని బి.సింగవరం గ్రామంలో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు పశుసంవర్ధక శాఖ సహాయకులు మోర్తా శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శరగడం సన్యాసినాయుడు, గొర్రెలు, మేకల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షులు చప్పా శ్రీనివాసరావు, కార్యదర్శి పంచదారల గంగరాజు పాల్గొన్నారు.



నట్టల మందు వేస్తున్న శ్రీనివాసం -రావు

'హేచరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని నెల్లిపూడి రెవిన్యూ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న హేచరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జాతీయ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు కొవిరి వెంకటేష్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, నెల్లిపూడి రెవెన్యు పరిధిలో నిర్వహిస్తున్న హేచరీ కోస్టల్ ఆథారిటీ ద్వారా ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేసుకోలేదని, పోల్యూషన్ కంట్రోల్ బోర్డు, మత్స్యశాఖ డిపార్టుమెంట్ల అనుమతులు తీసుకోకుండా హేచరీ నడుపుతున్నారని ఆరోపించారు. హేచరీకి విద్యుత్ కనెక్షన్ ఏ విధంగా ఇచ్చారో అర్థం కాలేదని, వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్, మత్స్య శాఖ ఏడిషనల్ డైరెక్టర్ కు ఫిర్యాదు చేశామన్నారు.

అనారోగ్యంతో ఎఎల్ఎమ్ వల్లీ మృతి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని చెల్లాపురం గ్రామానికి చెందిన ఈపిడిసియల్ అసిస్టెంట్ లైనమేన్(ఎఎల్ఎం) వల్లీ అనారోగ్యంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మండలంలోని దార్లపూడి శివారు చెల్లాపురం గ్రామానికి చెందిన వల్లీ ఈనెలలో బ్రెయిన్ స్ట్రోక్ కు గురయ్యారని బంధువులు తెలిపారు. విశాఖలోని ప్రయివేటు ఆసుపత్రిలో ఆపరేషన్ నిర్వహించి చికిత్స పొందుతూ మరణించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన పరవాడ సెక్షన్‌లో ఎల్టీ మీటర్ల విభాగంలో పని చేస్తున్నాడన్నారు. మృతుని కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, స్థానిక నాయకులు కొరుప్రోలు సెక్షన్ ఏఈ డి.గోపి ఇతర సిబ్బంది పరామర్శించారు.

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి-పాయకరావుపేట:స్థానిక కనోసా ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి పి.వైజ్ఞానిత నవోదయ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించింది ఈ మేరకు విద్యార్థిని వైజ్ఞానితను సోమవారం ప్రిన్సిపల్ సిస్టర్ సంతాన థామస్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు.



అభినందిస్తున్న సిబ్బంది



మాట్లాడుతున్న సర్పంచ్, గ్రామ పెద్దలు

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట పరికరాలు

ప్రజాశక్తి-రావికమతం:ఎంపీ నిధులతో అంగన్ వాడి కేంద్రాలకు ఆట పరికరాలు మంజూరైనట్లు రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఉషారాణి తెలిపారు. ప్రాజెక్ట్ పరిధిలో సొంత భవనాలు ఉండి ఆట పరికరాలు పెట్టేందుకు వీలుగా ఉన్న కేంద్రాలను ఎంపిక చేశారు. రావికమతం సెక్టార్ పరిధిలో చినపాశీల 3, గుమ్మాలపాడు కేంద్రాలు అనుకూలంగా ఉన్నాయన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆట పరికరాల రక్షణకు సోమవారం ఆయా గ్రామాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుమ్మాలపాడు గ్రామంలో జరిగిన సమావేశంలో సూపర్వైజర్ సరోజిని మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం విలువైన ఆటపరికరాలు అందిస్తుందని, వీటి రక్షణకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. గుమ్మాలపాడు సర్పంచ్ సన్యాసినాయుడు మాట్లాడుతూ, పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జి ఎంఎస్‌కె ఎం. వనజ అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

6న బియ్యం వేలం

ప్రజాశక్తి-కోటవురట్ల:ఇటీవల మండలంలో పలు ప్రాంతాల్లో 6 ఎ కేసులో పట్టుబడ్డ పిడిఎస్ బియ్యాను ఈనెల 6న వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జానకమ్మ తెలిపారు. పట్టుబడ్డ బియ్యాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట జయరాం పరిశీలించారన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో వివిధ ప్రాంతాల్లో పట్టుబడ్డ 144.22 క్వింటాళ్ల బియ్యాన్ని వచ్చే నెల 6న కోటవురట్ల ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద వేలం నిర్వహించనునట్లు తెలిపారు, ఆసక్తి కలవారు వేలంపాటలో పాల్గొనవలసిందిగా ఈ సందర్భంగా ఆమె కోరారు.

లేటరైట్ అనుమతులు రద్దు చేయాలి : సిపిఎం



మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: నాతవరం మండలం సుందరకోట పంచాయతీ బమిడికలొద్ది, అసనగిరి గ్రామాల అటవీ సరిహద్దు ప్రాంతంలో లేటరైట్ మైనింగ్ తవ్వకాలకు అనుమతులు రద్దు చేయాలని సిపిఎం నాయకులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, బినామి గిరిజనేతరడు జర్తా లక్ష్మణరావుకు మంజూరు చేసిన సుమారు 300ఎకరాల లేటరైట్ మైనింగ్ అనుమతులు రద్దు చేయాలన్నారు. 5వ షెడ్యూల్డ్ ఏరియా చట్టం 1950 అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రయోజనాలను రక్షించి గిరిజనులను కాపాడాలన్నారు. ఈ విషయమై జాయింట్ కమిటీ విచారణ నిమిత్తం బమీడికలొద్ది లెటర్ రైట్ ప్రాంతానికి ఈనెల 28న వస్తుందని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. భూమిని జర్తా లక్ష్మణరావుకు 20 ఏళ్ల కాల పరిమితి వరకు తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, వీటిని మించి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో మైనింగ్ తవ్వకాలు చేపట్టి వందలాది చెట్లు తొలగించారని విమర్శించారు. ఆదివాసులు సాగు చేస్తున్న పోడుభూములు, అటవీ ప్రాంతాన్ని గ్యాప్ ఏరియా పేరుతో మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇచ్చారన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో ఖనిజ తవ్వకాలు గిరిజనేతరులకు, బినామిలకు ఇవ్వడం చట్టవిరుద్ధమని, సరుగుడు ప్రాంతాల్లో లేట రైట్ ఖనిజ తవ్వకాలు చేపట్టడం నేరమన్నారు. ఈ అక్రమాలపై దర్యాప్తు జరిపి విలువైన ఖనిజ సంపదను అక్రమంగా దోపిడి చేస్తున్న వారిని శిక్షించాలన్నారు. గిరిజన, అటవీ పర్యావరణ, ఖనిజ నియంత్రణ చట్టాలను ఉల్లంఘించిన అధికారులు, ప్రయివేటు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీసా చట్టం ప్రకారం అసనగిరిలో గ్రామ సభ నిర్వహించకుండా మైనింగ్ తవ్వకాలు చేయడం నేరమన్నారు. మైనింగ్ ప్రాంతంలో సుమారు 10 కిలోమీటర్ల వరకు పోడు, సాగు భూమి కలుషితమవుతుందని తెలిపారు. ఇప్పటికైనా మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమలో సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, కెవీ సూర్యప్రభ పాల్గొన్నారు.



జ్ఞాపికను ఇస్తున్న అర్చకులు

వెంకన్నకు విరాళం

ప్రజాశక్తి- నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయానికి సోమవారం తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన గ్రంధి కామేశ్వరి తమ తల్లిదండ్రులు జ్ఞాపకార్థం లక్ష రూపాయల విరాళాన్ని దేవస్థానం అధికారులకు అందజేశారు. దాతకు అధికారులు రసీదు అందజేశారు. దాతకు స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, అర్చకులు భాగవతం గోపాలచార్యులు, నక్కపల్లికి చెందిన సుభాష్, గ్రంధి కమలాకర్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

కేర్‌లో

ట్రామా, ఎమర్జెన్సీ సేవలపై వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ట్రామా, ఎమర్జెన్సీ, అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ అంశాలపై వర్క్‌షాప్ జరిగింది. నగరంలో మొట్ట మొదటిసారిగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కేర్ హాస్పిటల్స్‌లో పలు విభాగాలకు చెందిన వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్ షాప్‌నకు ముఖ్య అతిథిగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సిఎం.త్రివిక్రమ వర్మ, గౌరవ అతిథులుగా డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా త్రివిక్రమ వర్మ మాట్లాడుతూ ప్రమాదాల కట్టడికి అవగాహన అత్యంత అవసరమని, ప్రమాదమేదైనా సరైన అవగాహనతో ప్రాణ నష్టం కలుగకుండా నియంత్రణ చేయవచ్చని తెలియజేశారు. ఇటువంటి సదస్సును ఏర్పాటు చేసిన కేర్ హాస్పిటల్స్‌ను అభినందించారు. సామాజిక బాధ్యతగా పలు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో సౌకర్యాలు ఉన్నప్పటికీ కేవలం సరైన సమయంలో చికిత్స అందించలేకపోవడానికి ప్రజలలో వ్యాధుల పట్ల, ప్రమాదాల తీవ్రత పట్ల అవగాహన లేకపోవడమే కారణమన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఎన్ఎమ్.కుమార్, జి.సత్యన్నారాయణ, కెఎస్.రవిశంకర్, జి.కిషోర్‌బాబు, ఎన్‌విఎస్.మోహన్, సందీప్ తలారి, కెఎస్.ప్రవీణ్ కుమార్, సంతోష్ రామ్, పి.సిద్ధార్థ్, డాక్టర్ అమరేంద్రబాబు, లక్ష్మీ రాణి, హరీష్, భరద్వాజ్ నాయుడు తదితరులు పలు అంశాలపై ప్రసంగించారు.



నినాదాలు చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

కాంట్రాక్ట్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-గొలుగొండ: వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గొలుగొండ మండలం ఏఎల్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ 2014 జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాలు పూర్తి అయిన వాళ్లకి మాత్రమే అర్హులని ప్రకటించిందని, 2009లో ఏజెన్సీ రిక్రూట్ అయిన వారు ఏజెన్సీ పరిస్థితి దృష్ట్యా 2011 నుంచి 2018 సంవత్సరాల్లో ఏజెన్సీ రిక్రూట్ జరిగాయన్నారు. మైదాన ప్రాంత ఉద్యోగులతో సమానంగా ఏజెన్సీ ప్రాంత ఉద్యోగులను చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు నాగమణి, వి.ప్రశాంత్ కుమారి, ఫార్మాసిస్ట్ కె.చిట్టిబాబు, హెల్త్ అసిస్టెంట్లు ఉపేంద్ర, ప్రకాష్, వినయ్‌కుమారి పాల్గొన్నారు.

కమిషనర్‌కు బిఆర్‌టిఎస్ బాధితుల వినతి

ప్రజాశక్తి-సింహాచలం: గోశాల నుంచి అడవివరం వరకు ఉన్న బిఆర్‌టిఎస్ బాధితులు సోమవారం జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మను కలిసి వినతిపత్రం అందించారు. బిఆర్‌టిఎస్ రోడ్డులో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం ఇప్పించాలని, తొలి పావంచా నుంచి అడవివరం వరకు బాధితులకు ఇస్తున్న మాదిరిగా తమకు చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బిఆర్‌టిఎస్ బాధిత సంఘం అధ్యక్షులు అక్కిరెడ్డి అప్పారావు, స్థానిక వైసిపి నాయకులు కోలుసు ఈశ్వరరావు, ఎర్రవరం బాబు, లంక సత్తిబాబు, గంట్ల కిరణ్‌బాబు, రాజా, సుధీర్ ఉన్నారు.

ఎఎస్‌పికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఇటీవల నర్సీపట్నం ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అదిరాజ్ సింగ్ రాణాను సోమవారం జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, నర్సీపట్నంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలని, ర్యాష్ డ్రైవింగ్ పై దృష్టి సారించాలని కోరారు. కళాశాలలు, పాఠశాలలు, ఆర్టీసి బస్టాండ్ వద్ద ఈవ్ టీజింగ్ జరగకుండా గస్తీ ఏర్పాటు చేయాలని తెలిపారు. . ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, రెండో వార్డు ఇన్చార్జ్ మొండెం శివ, నమ్మి రమణరాజు, వీసం వెంకటేష్ పాల్గొన్నారు.

క్రికెటర్ భరత్‌కు స్టీల్ సిఎమ్‌డి సత్కారం

ప్రజాశక్తి-ఉక్కునగరం : భారత టెస్ట్ క్రికెట్ జట్టులో స్థానం సంపాదించిన క్రికెటర్ కెఎస్.భరత్‌ను స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌బట్ సత్కరించారు. భరత్ చేసిన సాధన అతనిని జాతీయ జట్టుకు చేర్చిందని సిఎమ్‌డి పేర్కొన్నారు. ఉక్కు యాజమాన్యం తనకు అందించిన మద్దతుకు భరత్ కృతజ్ఞతలు తెలిపారు. ఉక్కునగరం క్రికెట్ మైదానంలో సరైన బౌన్స్‌తో కూడిన పిచ్, పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని, క్రీడాకారులు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టడానికి సరైన వాతావరణం కల్పిస్తుందని భరత్ తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ జె.కృష్ణారావును సిఎమ్‌డి అతుల్‌భట్ సత్కరించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్‌గా నియమితులైన స్టీల్‌ప్లాంట్ మాజీ జిఎం ఎంఎస్.కుమార్‌ను కూడా ప్రముఖులు సత్కరించారు. వాణిజ్య విభాగ డైరెక్టర్ డికె.మహంతి, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ ఎకె.బగ్చి, పర్సనల్ డైరెక్టర్ ఎస్‌సి పాండే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కరుణరాజు, విఎస్‌జిహెచ్ సీజీఎం కెహెచ్.ప్రకాష్ క్రీడాకారులను అభినందించారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లోని సికె.నాయుడు ఉక్కు స్టేడియంలో కెఎస్.భరత్ అప్పుడప్పుడు ప్రాక్టీస్ చేస్తుంటారు.



భరత్‌ను సన్మానిస్తున్న స్టీల్‌ప్లాంట్ సిఎండి

సమస్యలపై ఎమ్మెల్యే బాబూరావుకు మొర

ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సోమవారం వెంకటాపురం గ్రామంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు స్థానికులు మొర పెట్టుకున్నారు. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, గ్రామస్తులు అధిక చార్జీలు చెల్లించి ఆటోలో ప్రయాణించాల్సి వస్తుందని తెలిపారు. అనంతరం గ్రామంలో స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా గ్రామంలో కాలనీ ఇల్లు మంజూరుకు వేడుకున్నారు. గతంలో గ్రామ శివారున ఇచ్చిన కాలనీ స్థలం నివాసయోగ్యం కాకపోవడంతో లబ్ధిదారులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో తాగునీటి, డ్రెయినేజీ, పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో అధికారులతో సమావేశమై సచివాలయ సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలని మండల ప్రత్యేక అధికారి డిఎల్‌డిఓ అరుణశ్రీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు పైలా రమేష్, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, స్థానిక సర్పంచ్ ఇందిరా శ్రీదేవి, తహసిల్దార్ జానకమ్మ, ఏఓ చంద్రశేఖర్, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

సభ్యుల షేర్లపై 12 శాతం డివిడెండ్ చెల్లింపు

-విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ రాఘవేంద్రరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ కో - ఆపరేటివ్ బ్యాంకు సభ్యుల షేర్లపై 12 శాతం డివిడెంట్‌ను ఈ ఏడాది చెల్లించినట్టు బ్యాంకు ఛైర్మన్ సిహెచ్.రాఘవేంద్రరావు తెలిపారు. సోమవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిడెండ్ చెల్లింపు ద్వారా రూ.33.56 కోట్లను సభ్యుల ఖాతాలకు జమ చేశామన్నారు. బ్యాంకు సాధించిన లాభాలు, మిగులు నేపథ్యంలో రికార్డు స్థాయిలో డివిడెంట్ కూడా చెల్లించాలని నిర్ణయించామన్నారు. ఏడాది బ్యాంకు వ్యాపార లక్ష్యం 2024 మార్చి 31 నాటికి రూ.7728.43 కోట్లు కాగా, డిపాజిట్లు లక్ష్యం రూ.4350.37 కోట్లు, రుణాల లక్ష్యం రూ.3378.06 కోట్లుగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు డిపాజిట్లు రూ.3929 కోట్లు, రుణాలు రూ.3052 కోట్లు, వ్యాపారం రూ.7026 కోట్లకు చేరుకున్నాయని వివరించారు. బ్యాంకు సభ్యులు 92,831 మందికాగా షేర్ ధనం రూ.305 కోట్లుగా నమోదైందన్నారు. వచ్చే ఏడాదికి బ్యాంకు సభ్యులు సంఖ్య లక్ష మంది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. షేర్ ధనంలో తమ బ్యాంకు దేశంలోనే నాలుగో స్థానాన్ని పొందిందన్నారు. అలాగే డిపాజిట్ల సేకరణలో 16వ స్థానం, రుణాల జారీలో 14వ స్థానం, నికర లాభాలలో 9వ స్థానంలో బ్యాంకు నిలవడం అర్బన్ బ్యాంకింగ్ వ్యవస్థలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు స్థానాన్ని, దాని పటిష్ట స్థితిని తెలియజేస్తుందన్నారు. ఎమిరిటస్ ఛైర్మన్ మానం ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో స్వతంత్రంగా వ్యవహరించాల్సిన చాలా సంస్థలు అలా వ్యవహరించడం లేదని, అదే బాటలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా కూడా పని చేస్తోందని అన్నారు. సమావేశంలో బ్యాంకు సీనియర్ వైస్ ఛైర్మన్ జి.భాస్కరరావు, డైరెక్టర్లు ఎజె.స్టాలిన్, కాకి భవాని, వి.చంద్రశేఖర్, సిహెచ్.ఆదినారాయణ శాస్త్రి, ఎస్.జానకి రామచంద్రరాజు, బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి పివి.నరసింహమూర్తి, బ్యాంకు జనరల్ మేనేజర్ ఎవి.రామకృష్ణారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ రాఘవేంద్రరావు